క్లుప్తంగా

మేడే పోస్టర్ల ఆవిష్కరణ



ధర్పల్లి: మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. మేడే వేడుకలను జయప్రదం చేయాలని,కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు రాజు, లక్ష్మి, లింబాద్రి, వనిత, కస్తూరి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు



ధర్పల్లి: మండలంలోని మైలారం, దుబ్బాక, చల్లగర్గ గ్రామాల్లో ఇటీవల అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఏడీఏ పిండి ప్రదీప్ కుమార్, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. అలాగే పంట నష్టం పరిహారం వివరాలను నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో వీఆర్‌ఏలు, ఏఈఓలు ఆయా రైతుల పొలాల వద్దకు వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించి నమోదు చేస్తున్నారని ఏవో ప్రవీణ్ తెలిపారు. తహసీల్దార్ గంగాసాగర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మోపాల్ మండలంలోని కంజర్, కులాస్‌పూర్, బాడ్సి, మోపాల్, మంచిప్ప గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పంపిణీ చేశారు. నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు మొచ్చ శ్రీనివాస్, ఇందూరి సిద్ధార్థ, సతీష్‌రెడ్డి, ముత్యం, శ్రావణ్, శ్రావణ్‌కుమార్, సాయిలు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి



ఖలీల్‌వాడి: మేడే వేడుకలను జయప్రదం చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కల్లెడి గంగాధర్ పేర్కొన్నారు. నగరంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పనికి తగిన వేతనం, పనిదినాలు, కార్మికుల హక్కుల కోసం ప్రాణాలను త్యాగం చేసిన రోజు మేడే అని పేర్కొన్నారు. టీఎస్‌టీయూసీ (టీడీపీ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా కార్యాలయంలో మే ఒకటిన మేడేను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కొయ్యేడి నర్సింలు, కార్మిక నాయకులు రఫీఖ్ ఖాన్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ప్రవీణబాయికి సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ప్రవీణబాయి శనివారం పదవీ విరమణ చేయనున్నారు. ఈసందర్భంగా తెయూలో శుక్రవారం హిందీ విభాగాధిపతి ఎండీ జమీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రవీణబాయికి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు గులేరాణా, సమత, పార్వతి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాట్లు పూర్తి

రెంజల్(బోధన్): నేటి నుంచి వచ్చే నెల 5 వరకు నిర్వహించే పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలో గల సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో నూతనంగా నిర్మించిన విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం యజ్ఞశాలలను నిర్మించారు. శనివారం సాయంత్రం 3గంటలకు సీతారామ ఆశ్రమం నుంచి మొదటగా కందకుర్తి గ్రామ దేవతలకు కలశపూజతో ప్రారంభమవుతుందన్నారు.

సబ్‌సెంటర్ భవనం పూర్తయ్యేదెప్పుడో?

- అర్ధంతరంగా నిలిచిన పనులు
- ఇబ్బందుల్లో గుండారం ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గుండారంలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్ర భవనం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామ ప్రజల సౌకర్యం కోసం నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దాదాపు అయిదు సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన పనులకు నిధులు సరిపోక కాంట్రాక్టర్ మధ్యలోనే చేతులెత్తేయడంతో పనులు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నాయి. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోగం వస్తే నిజామాబాద్‌కే..

గుండారం గ్రామంలో ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం గ్రామ పంచాయతీ కార్యాలయం మొదటి అంతస్తులో కొనసాగుతోంది. ఆరోగ్య సమస్యలు ఉన్న వృద్ధులు, గర్భిణులు మొదటి అంతస్తుపైకి ఎక్కాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రం అందుబాటులోకి రాకపోవడంతో గుండారం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు సైతం నిజామాబాద్ ప్రభుత్వ లేదా, ప్రయివేట్ ఆస్పత్రులకు రావల్సివస్తోంది.

ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభం..

గ్రామంలో జనాభా ఎక్కువగా ఉండటంతో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) కింద ఐదు సంవత్సరాల క్రితం రూ. 12 లక్షల నిధులతో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నిధులు భవన నిర్మాణం పనులకు సరిపోకపోవటంతో సదరు కాంట్రాక్టర్ తనకు వచ్చిన నిధులతో పనులు పూర్తిచేసి మధ్యలోనే చేతులెత్తేశారు. దీంతో గత రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వం మరో రూ. 4లక్షలు మంజూరు చేయటంతో మరికొంత పనులు జరిగాయి. అయిన నిధులు సరిపోకపోవటంతో పనులు మళ్లీ నిలిచిపోయాయి. అలాగే ఆరోగ్య ఉపకేంద్రం భవనం పనుల్లో నాణ్యత లోపం చోటుచేసుకుంది. గోడలకు సరైన వాటర్ క్యూరింగ్ చేయక పోవటంతో సిమెంట్ గోడలకు పట్టుకోకుండా రాలిపోతోంది. ఇప్పటికీ పరిస్థితి అలాగే ఉండటంతో భవనం నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని నాణ్యతగా నిర్మించి, పనులను పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాను..



గుండారంలో ఆరోగ్య ఉపకేంద్రంతో గ్రామ ప్రజలకు మంచి వైద్యం అందుబాటులోకి రాబోతోంది. కానీ భవన నిర్మాణ పనులకు నిధులు సరిపోకపోవటంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు నిధులు మంజూరు చేసి భవనాన్ని త్వరగా పూర్తిచేయాలి.

–లక్ష్మణ్‌రావు, సర్పంచ్, గుండారం

పనుల్లో నాణ్యత లేదు..



గుండారం గ్రామంలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం పనుల్లో నాణ్యత లోపించింది. గోడలకు సరైన విధంగా వాటర్ క్యూరింగ్ చేయకపోవటంతో సిమెంట్ ఇసుక రాలిపోతోంది. దీంతో భవనం గట్టిదనం కోల్పోయి కొద్ది సంవత్సరాల్లోపే భవనం దెబ్బతింటుంది.

– సుదర్శన్‌రెడ్డి, గుండారం

బంగ్లా ఎక్కాలంటే ఇబ్బంది..



ఆరోగ్య కేంద్రం పంచాయతీ ఆఫీస్ బంగ్లాపై ఉంది. జ్వరం, ఒళ్లు నొప్పులు వస్తే బంగ్లాపైకి ఎక్కి దిగాలంటే అవస్థ పడుతున్నాం. దవాఖానను కిందనే ఏర్పాటు చేయాలి.

–మారమ్మ, గుండారం

పనులు పూర్తిచేయాలి..



గ్రామంలో గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు, మందుల కోసం ఆరోగ్య కేంద్రానికి రావల్సి ఉంది. ఇక్కడ ఆరోగ్యకేంద్రం బంగ్లాపై ఉండటంతో గర్భిణులు ఎక్కి, దిగాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రం పనులు త్వరగా పూర్తిచేయాలి.

–సోనీ, గుండారం

డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలి





జక్రాన్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు.. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

జక్రాన్‌పల్లి: ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.10లక్షలు, రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి దేవరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కిషన్, పుప్పలపల్లిసాయిలు, గంగాధర్, రాజారాం, అనిల్‌కుమార్, శంకర్, రాజన్న, దుర్గప్రసాద్, ప్రభాకర్, నజీర్, మనోజ్, నిరుపేదలు తదితరులు పాల్గొన్నారు

డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న రేషన్‌డీలర్లు

- జూన్ 5నుంచి సమ్మె
- రేషన్ డీలర్ల జేఏసీ చైర్మన్ రాజు

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని రేషన్‌డీలర్లకు గౌరవ వేతనం అమలు చేయాలని రాష్ట్ర రేషన్‌డీలర్ల ఐక్య కార్యచరణ కమిటీ చైర్మన్ నాయకోటి రాజు డిమాండ్ చేశారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో శుక్రవారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ.. రేషన్‌డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం అప్పగించిన పనిని డీలర్లు సక్రమంగా పూర్తి చేస్తున్నారని తెలిపారు. డీలర్లకు కమీషన్ తక్కువ మొత్తంలో ఇస్తున్నారని, కనీసం రూ.250కి పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దిగుమతి హమాలీని ప్రభుత్వమే భరించాలన్నారు. రాబోయే రోజుల్లో డీలర్లకు అండగా ఉండే పార్టీకే జేఏసీ మద్దతు ఉంటుందని, త్వరలోనే ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 5నుంచి రాష్ట్రంలోని రేషన్‌డీలర్లు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు ప్రతిజ్ఞ చేశారు. జేఏసీ వైస్ చైర్మన్ బత్తుల రమేష్‌బాబు, కన్వీనర్లు దొమ్మాటి రవీందర్, గడ్డం మల్లికార్జున్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు అతిమెల నాగేష్, ప్రధానకార్యదర్శి పార్థసారధి, కోశాధికారి ఖమర్ ఖాన్, నగర అధ్యక్షుడు దండు శేఖర్, కార్యదర్శి ప్రవీణ్ యాదవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు పొల్కం గంగాకిషన్, కామారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, శంకర్ రావు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



కలెక్టర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్
- కలెక్టర్ చాంబర్ ఎదుట ధర్నా

సుభాష్‌నగర్: అకాల వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా సుమారు 50వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు పరిహారం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో మెరుపు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు నగరశివారులోని కాలూర్ రోడ్డులో నేలకొరిగిన పంట పొలాలు, జీజీ కళాశాలలో ఐకేపీ సెంటర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.రైతు సమస్యలను పట్టించుకోకుండా దేశాన్ని పట్టుకుని తిరిగే సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలని పిలుపునిచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకూ బీజేపీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో ఫోన్లో మాట్లాడటంతో ధర్నాను విరమించారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు లక్ష్మీనారాయణ, గోపిడి స్రవంతిరెడ్డి, భరత్ భూషణ్, సుదర్శన్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పంచరెడ్డి శ్రీధర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్‌సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏడీఈ తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని న్యూ హౌసింగ్‌బోర్డు, విద్యుత్‌నగర్, చంద్రశేఖర్ కాలనీ, మారుతినగర్, గంగాస్థాన్ ఫేస్–1 ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

ధర్మారం(బి) వీడీసీ..



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తలారి సాయన్న, వైస్ చైర్మన్‌లుగా సర్వరాజు, ఎడెల్లి సోమనాథ్, ఆరుముల్ల నాగేశ్వర్రావు, బత్తెపు సత్యనారాయణ, గంగాధర్ గౌడ్, బాలగంగాధర్, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గోరంట్ల రాజేష్, జాయింట్ సెక్రెటరీలుగా ఏరుకొండ కృష్ణ, మిరిదొడ్డి సాయిలు, కోటగిరి రాజు, కీర్తి నర్సయ్య, కోశాధికారిగా పోలపల్లి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కొట్టల ప్రీతమ్, ఉల్లెంగ శ్రీనివాస్, యకరం శ్రీనివాస్, మొగుళ్ల మహిపాల్‌తో పాటు 6గురు సలహాదారులు, 9మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా ఎన్నికయ్యారు. నూతన వీడీసీ సభ్యులను సర్పంచ్ పత్తి మమత ఆనంద్ అభినందించారు.

రైతు కూలీ సంఘం..



సిరికొండ: అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తాళ్ల రామడుగు గ్రామానికి చెందిన బొక్కల భాస్కర్ ఎన్నికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈనెల 25 నుంచి 27 వరకు జరిగిన రాష్ట్ర రెండవ మహాసభల్లో భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనను ఎన్నుకున్నందుకు ఆయన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

కల్యాణ మండపానికి నిధులు మంజూరు



వంజరి సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్యకు చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర వంజరి సంఘం నుంచి నిజామాబాద్ వంజరి కల్యాణ మండపం నిర్మాణానికి రూ.5లక్షలు నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాస్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు నగరంలోని జిల్లా సంఘం కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు భోనేకర్ భూమయ్యకు చెక్కును అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పైచదువుల నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చే వంజరి కుల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైతే హాస్టల్‌లో ఉండి చదువుకోవాలని భావిస్తారో వారికి అవకాశాలు కల్పిస్తామని, ఈనెల 30లోపు రాష్ట్ర సంఘానికి సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. సంఘ సభ్యులు శ్రీనివాస్, సాయిరాం, రాజు, గోపాల్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన అన్నదాతలను ఆదుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

ఖలీల్‌వాడి: అకాల వర్షాలకు పంట నష్ట పోయిన అన్నదాతలకు ఎకరానికి రూ.40 వేలు అందించి, ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి అకుల పాపయ్య పేర్కొన్నారు. నగరంలోని ఎన్‌ఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, సజ్జ, పసుపు, మామిడి తదితర పంటలు దెబ్బతిన్నాయని, ధాన్యం తడిసి ముద్దాయిందని కొన్ని చోట్ల మొలకలు వచ్చాయన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలు రైతుబంధు, రైతుబీమా ఇవ్వాలన్నారు. నాయకులు భూమయ్య, దేషెటి సాయరెడ్డి, శివకుమార్, మురళి, మోహన్, శంకర్ పాల్గొన్నారు.

రోటరీ సేవలు పేదలకు మేలు



జీజీహెచ్‌కు వీల్‌చైర్లు అందజేస్తున్న రోటరీ సభ్యులు

నిజామాబాద్ సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవ కార్యక్రమాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో 50 వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో చైర్మన్ పాల్గొని మాట్లాడారు.రోటరీ ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. మేయర్ నీతూ కిరణ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా, ఏసీపీ కిరణ్ కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, క్లబ్ అధ్యక్షుడు సతీష్ షా, విశాల్ ఆకుల, హరీష్ స్వామి, శ్రీరామ్ సోని, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సాధుసమ్మేళనం

బాల్కొండ: మండల కేంద్రంలో ఇందూరు సాధు పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన 17వ వేదాంత జ్ఞాన మహాసభల సాధుసమ్మేళనం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. జిల్లాలోని వివిధ ఆశ్రమాలకు చెందిన పండితులు, సాధువులు తరలి వచ్చి ధర్మ ప్రవచనాలను బోధించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,250	వెండి (కిలో)	75,000
22 క్యారెట్స్	57,396		– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	35	50
బెండకాయ	20	40	గాజరుగడ్డ	15	30
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	40	60	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	20	40
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్–1– ఏజెంట్ – 10.15,4.25
పొన్నియిన్ సెల్వన్ భాగం–2–1.15,7.25,10.35
స్క్రీన్–2– రా రా పెనిమిటీ–11.00
విరూపాక్ష –1.25,7.30,10.25
కిస్ కా భాయ్– కిసి కీ జాన్(హిందీ)–4.25
స్క్రీన్–3 – పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –10.20,4.30 –ఏజెంట్ –1.30,7.40,10.40
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –12.00, 3.30,7.00,10.30
స్క్రీన్–2– ఏజెంట్ –11.50,3.10,6.30,9.50
స్క్రీన్–3– ఏజెంట్– 10.30
ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్)–2.50,8.15
విరూపాక్ష –5.10,10.35
స్క్రీన్–4– పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –10.15
కిస్ కా భాయ్ – కిస్ కీ జాన్ –(హిందీ) –1.45.7.10
దేవి పొన్నియిన్ సెల్వన్ భాగం–2
నటరాజ్ కిసి కా భాయ్–కిసి కీ జాన్(హిందీ)
లలితామహల్ ఏజెంట్
విజయ్ విరూపాక్ష

వర్నిలో టీడీపీ మినీ మహానాడు

వర్ని: మండల కేంద్రంలో శనివారం తెలంగాణ టీడీపీ మినీ మహానాడు నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి విఠల్ వెల్లడించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా వర్నిలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహానాడుకు తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని వెల్లడించారు.

హుండీ లెక్కింపు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మారుతి మందిరం హుండీని దేవాదాయ, ధర్మాదాయ జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ పర్యవేక్షణలో శుక్రవారం లెక్కించారు. ఆదాయం రూ. 21,535 వచ్చింది. హనుమాన్ జయంతి నుంచి శుక్రవారం వరకు లెక్కించినట్లు ఆలయ ఈవో రవీందర్ గుప్తా వివరించారు.

'కార్గో' సెంటర్ ప్రారంభం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సర్వీస్ సెంటర్‌ను రోడ్డు రవాణా సంస్థ రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శంకర్ గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి పార్శిల్ తెప్పించుకోవడం లేదా పంపించడం వంటి సేవలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.